చక్కనమ్మ చిక్కినా అందమే అన్నట్టు యింకా పూర్తిగా ఆరోగ్యం చేకూరని రజియా - అతి మామూలుగా ఓ వాయిలుచీరలో వున్న రజియా అప్పటి అందం ఎప్పటికన్నా నన్నాకర్షించింది. యిద్దరం ఒక్క క్షణం మిగతావారిని మరిచి చూచుకుంటూ వుండిపోయాం. నేనే ముందు తేరుకుని 'హలో-ఎలా వున్నారు. వంట్లో బాగుందా' అని అడిగాను - మా మొహాలు చూస్తూ రమ, శకుంతల కొంటెగా నవ్వుతూ 'వోయ్ దొంగా! డాక్టరు ఫీజు యీయకుండా ఎగగొట్టేశావుట, వసూలు చేసుకోవడానికి వచ్చారు. ఏమిస్తావో ఎంతిస్తావో మీరు మీరు చూసుకోండి అంటూ లోపలికి వెళ్ళారు. కొత్త దంపతుల్లా ఇద్దరం సిగ్గుపడుతూ వుండిపోయాం. కాస్సేపటికి రజియా కుర్చీ జరిపి 'కూర్చోండి' అంది. తరువాత చాలా నెమ్మదిగా "థేంక్స్" అంది. దేనికి అన్నా ఆశ్చర్యంగా, చాలా శ్రమపడి నన్ను గుర్తుంచుకొని వచ్చినందుకు' అంది బిడియంగా. "రాకుండా వుండగలనని ఎలా అనుకున్నావు, ఈ వారం రోజులుగా ప్రతి క్షణం నీ దగ్గరికి రావాలనే అనుకున్నాను-నిజం అన్నట్టు రజియా కళ్ళెత్తి చూసింది.

"మళ్ళీ యింతవరకు మనం కలుసుకుంటాం అనుకోలేదు రజియా-నీ అడ్రసు అడగలేదు-నిన్నెలా కలవాలో తెలియక యీ వారం ఎంత చికాకుగా గడిపాననుకున్నావు. "రజియా కళ్ళెత్తి చూసింది. ఆ కళ్ళల్లో కృతజ్ఞత, ఆరాధన, అభిమానం — ఇద్దరి మనసుల భావాలు తెలియ చెప్పడానికి మాటలే అవసరం లేదు అన్పించింది ఆ క్షణాన, రజియా పెద్ద కళ్ళు తెలియ చెప్పిన భావం ఎలా మరిచి పోగలను.

"రజియా" నా గొంతులో మార్దవం నాకే ఆశ్చర్యం కలిగచింది.ఏదో చెప్పా లని వున్నా ఏం చెప్పాలో తెలియక తడబడ్డాను. ఈలోగా రజియా తల్లి వచ్చి రా బాబూ ఈ వారం రోజులుగా మీ గురించి మేం అందరం అనుకోని క్షణం లేదు. మీరు మాకు చేసిన సహాయం మరవలేం." అంటూ మొదలు పెట్టింది. ఏదో మాట్లాడుతూనే వున్నా మా యిద్దరి చూపులు, మనసులు మాట్లాడుకుంటూనే వున్నాయి.

—అప్పటి నుంచి ప్రతి ఆదివారం రజియా యింటికి వెళ్ళడం అలవాటయిన కార్యక్రమంగా మారింది. ఆదివారం వాళ్ళతో పాటే భోజనం చెయ్యాలని రమ, శకుంతల బలవంత పెట్టారు మొదటి వారం. రోజంతా నలుగురం పేకాడుకుంటూ